క్లుప్తంగా

సొంత గూటికి సర్పంచ్

అశ్వారావుపేటరూరల్: కొంతకాలం క్రితం తమ పంచాయతీలో అభివృద్ధి జరగడం లేదని, పట్టా భూముల సమస్యలు పరిష్కారం కావడం లేదని సర్పంచ్‌తో సహా ఊరంతా బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేయగా.. తిరిగి వారంతా సోమవారం పార్టీలో చేరారు. మండల పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో సీసీ రోడ్ల ప్రారంభోత్సం కార్యక్రమానికి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు హాజరు కాగా, ఆయన సమక్షంలోనే గ్రామ పంచాయతీ సర్పంచ్ మడకం స్వరూప, ఉప సర్పంచ్, వార్డు సభ్యులతోపాటు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. వారందరికీ ఎమ్మెల్యే చేతుల మీదుగా పార్టీ కండువ కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పంచాయతీలో అభివృద్ధి పనులు చేయడం కరోనా కారణంగా ఆలస్యమైందని, త్వరలోనే మరిన్ని అభివృద్ధి పనులు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులంతా కలిసి ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, ఎంపీటీసీ పద్దం కుమారి, మాజీ జెడ్పీటీసీ జేకేవీ రమణారావు, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, కాసాని చంద్రమోహన్, మడకం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కోత పేరుతో ఇబ్బందులు

అశ్వాపురం: మండల పరిధిలోని మొండికుంట గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో కోత పైరుతో మిల్లర్ల దోపిడీకి రైతులు ఇబ్బంది పడుతున్నారని తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పగడాల కరుణాకర్ రెడ్డి అన్నారు. మొండికుంట ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం టీజేఎస్ నాయకులు సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ.. కాటాలు అయిన ధాన్యం దిగుమతి చేసుకోవడానికి మిల్లర్లు ససేమిరా అంటున్నారని, పది కేజీల కోత పెడుతూ ఒక్కో లారీకి రైతుల వద్ద రూ.10 వేల నుండి రూ.20 వేలు డిమాండ్ చేస్తున్నారని వెల్లడించారు. అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే రైతులను ఐక్యం చేసి ఆందోళనలు చేపడుతామన్నారు. టీజేఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సురకంటి ప్రభాకర్ రెడ్డి, పిప్పల్ల శ్రీనివాస్, ఉపేంద్ర పాల్గొన్నారు.

పాస్ పుస్తకాలు ఇవ్వాలి

దుమ్ముగూడెం: ఆదివాసీ రైతులకు చెందిన పెండింగ్ లో ఉన్న పట్టాలు, అర్హత కలిగిన రైతులకు భూమి పట్టా పాస్ పుస్తకాలు ఇప్పించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ అధ్యక్షుడు సోందె మల్లూరు, పర్ణశాల సర్పంచ్ తెల్లం వరలక్ష్మి కోరారు. సోమవారం తహసీల్దార్ ప్రతాప్‌తో వారు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పెండింగ్ లో ఉన్న పట్టాల కోసం ఆఫీస్ చుట్టూ నెలలు, సంవత్సరాలు తరబడి తిరుగుతున్న అమాయక రైతులను ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. సీతమ్మ ప్రాజెక్టు కరకట్ట కోసం జరిగే రెండో సర్వేలో భూమిని కోల్పోతున్న రైతులందరికీ పరిహారం అందించాలని కోరారు. నాయకులు కోర్స రమేష్, వెంకటేశ్వరరావు, సోంది గంగరాజు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌పీఐ జిల్లా అధ్యక్షుడిగా కేసుపాక

బూర్గంపాడు: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ) జిల్లా అధ్యక్షుడిగా సారపాకకు చెందిన కేసుపాక నర్సింహారావును సోమవారం నియమించారు. కేంద్ర న్యాయ, సామాజిక శాఖ మంత్రి రాందాస్ హతవలే ఆదేశాల మేరకు పార్టీ తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జ్ పేరం శివనాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన నియామకపు పత్రాలను అందుకున్నారు. తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్షుడిగా నియమించేందుకు సహకరించిన మద్దిశెట్టి శామ్యేల్‌కు, పేరం శివనాగేశ్వరరావుకు కేసుపాక కృతజ్ఞతలు తెలిపారు.

కులపత్రాలు రద్దు చేయాలి

అశ్వాపురం: ఆదివాసీ కోయ సంస్కృతి, సంప్రదాయ వ్యవహారాలను పాటించకుండా ఇతర మతాలకు మార్పిడి చెందిన వారి కుల పత్రాలు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ఆదివాసీ పేస్ తలపతుల అసోసియేషన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం తహసీల్దార్ ఎంఏ.రాజుకు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ మత మార్పిడి వల్ల కోయ జాతి కుల, మత మనుగడ, సంస్కృతి, సాంప్రదాయాలు దెబ్బతింటున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.నాగయ్య, తాటి వెంకటేశ్వర్లు, ఊకె చంద్రయ్య, తెల్లం శ్రీను, కె.రాజు పాల్గొన్నారు.

భూవివాదాలను పరిష్కరించండి

ములకలపల్లి: ములకలపల్లి, పాల్వంచ, భద్రాచలం మండలాల్లో ప్రభుత్వ భూముల అంశంలో నెలకొన్న వివాదాలు పరిష్కరించాలని కోరుతూ జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ అనంతనాయక్‌కు స్థానిక ఆదివాసీ నాయకులు వినతిపత్రం అందజేశారు. సోమవారం ఖమ్మంలో అనంతనాయక్‌ను కలిసి మండలపరిధిలోని సీతారాంపురంతోపాటు పాల్వంచ భద్రాచలం మండలాల్లో నిరుపేదలు జీవిస్తున్న స్థలాలకు హక్కుపత్రాలివ్వాలని అభ్యర్థించారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఆదివాసీ తెగల సమన్వయకర్త సోయం కన్నరాజు, ఆదిమ ఆదివాసీ తెగల రాష్ట్ర నాయకుడు సోయం బాబూరావు, ఊకే ముక్తేశ్వరరావు, బాడిశ భిక్షం ఉన్నారు.

అధిక లోడు.. మితిమీరిన వేగం..

- బీటీపీఎస్‌కు వెళ్లే లారీల తీరిది..
- లోడ్ నుంచి రోడ్లపై పడుతున్న బొగ్గు పెళ్లలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు
- ఆందోళనలో పాదచారులు, వాహనదారులు



ప్రధాన రహదారిపై పడిన బొగ్గు పెళ్లలు



అధిక లోడుతో వెళ్తున్న బొగ్గు లారీ

మణుగూరురూరల్: మణుగూరు మండలంలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు మణుగూరులోని సింగరేణి ఏరియా నుంచి నిత్యం లారీలతో బొగ్గు రవాణా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సింగరేణి బొగ్గును తీసుకువచ్చే లారీలు అధిక లోడ్‌లతో, మితిమీరిన వేగంతో బీటీపీఎస్‌కు వెళ్తున్నాయి. లారీలు అధిక లోడ్‌లతో బొగ్గు వేగంతో వెళ్లడం వల్ల లారీలో నుంచి బొగ్గు పెళ్లలు రోడ్లపై పడుతున్నాయి. దీని వల్ల రోడ్లపై వెళ్తున్న పాదాచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై ప్రయాణిస్తున్న వారిపై ఈ బొగ్గు పెళ్లలు పడిన సంఘనలు అనేకం. బీటీపీఎస్‌కు వెళ్లే మార్గమధ్యంలో బొగ్గు లారీలు యాక్సిడెంట్లు గురికావడం బొగ్గు లారీల మితిమీరిన వేగానికి నిదర్శనం. సింగరేణి ఏరియా నుంచి వస్తున్న బొగ్గు లారీలకు నిబంధనలకు విరుద్ధంగా అధిక లోడ్లతో బీటీపీఎస్‌కు వెళ్లడంపై సింగరేణి అధికారుల పనితీరు ఏంటో, వారి నిబద్ధత ఎలా ఉందో అర్థమవుతుంది. సింగరేణి నుండి అధిక లోడ్లతో వస్తున్న బొగ్గు లారీల పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నియంత్రణలో అధికారుల విఫలం..

సింగరేణి నుంచి బీటీపీఎస్‌కు వెళ్తున్న లారీల మితిమీరిన వేగాన్ని నియంత్రించడంలో సంబంధిత అధికారులు వైఫల్యం చెందినట్లు మండల ప్రజలు అభిప్రాయపడుతున్నారు. ప్రధానంగా విజయనగరం నుంచి బీటీపీఎస్ వరకు జరుగుతున్న యాక్సిడెంట్లను, బొగ్గు లారీల వేగాన్ని నియంత్రించడంలో అధికారుల పనితీరు కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. లారీల నుంచి పడుతున్న బొగ్గు పెళ్లల నివారణకు సింగరేణి, బీటీపీఎస్ అధికారులు చర్యలు తీసుకున్నది లేదు. సింగరేణిలో లారీలను పూర్తి భద్రతతో లోడ్ చేసింది లేనిది పర్యవేక్షిస్తారా లేదా అన్నది ప్రజల్లో నానుతున్న ప్రశ్న. భద్రతను పాటించని లారీలకు లోడింగ్ ఇవ్వొద్దని, మితిమీరిన వేగంతో వెళ్లి యాక్సిడెంట్లు చేస్తున్న లారీలను గుర్తించి పూర్తి స్థాయిలో చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. అలా అయితే తప్ప బొగ్గు లారీల మితిమీరిన వేగానికి, అవి చేస్తున్న యాక్సిడెంట్‌లకు అడ్డు అదుపు ఉండదు.

అతివేగాన్ని నియంత్రించాలి

మణుగూరు–బీటీపీఎస్‌కు వెళ్లే బొగ్గు లారీలు అతి వేగంగా ప్రయాణిస్తున్నాయి. దీనివల్ల ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. బొగ్గు లారీల అతి వేగాన్ని నియంత్రించేలా సింగరేణి అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గాజుల నరసింహారావు, స్థానికుడు

రక్షణ చర్యలు పాటించేలా చూడాలి

బీటీపీఎస్‌కు రవాణా అవుతున్న లారీలపై టార్పలిన్ పట్టాలు సరిగా కప్పకపోవడం బొగ్గు పెళ్లలు రహదారిపై పడుతున్నాయి. ఆ సమయంలో ఎవరైనా లారీ పక్కగా ప్రయాణిస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– రమేష్, స్థానికుడు

కార్యకర్తలకు అండగా ఉంటాం



చింతల బయ్యారంలో సమస్యలు తెలుసుకుంటున్న రేగా కాంతారావు

పినపాక: బీఆర్‌ఎస్‌లోని ప్రతి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని తెలంగాణ ప్రభుత్వ విప్, పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. సోమవారం పినపాక మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. మండల పరిధిలోని పాతరెడ్డిపాలెం, చింతల బయ్యారం, జగ్గారం, వెంకటరావుపేట గ్రామపంచాయతీలో కార్యకర్తలు, నాయకుల కుటుంబాలను పరామర్శించారు. పలు వివాహ శుభకార్యాలకు సైతం హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని తెలిపారు. మూడోసారి రాష్ట్రంలో అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు సతీష్ రెడ్డి, ఎంపీపీ గుమ్మడి గాంధీ, వైస్ ఎంపీపీ కంది సుబ్బారెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు, సర్పంచ్‌లు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

దుమ్ముగూడెం: మండలంలోని రేగుబల్లి గ్రామంలో ఆర్లగుడెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో డాక్టర్లు ఈసం ఉషారాణి, జయ పాల్గొని 121 మంది రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో కీళ్ల నొప్పులు, బీపీ, షుగర్, పక్షవాతం, థైరాయిడ్, జలుబు, దగ్గు, స్త్రీ సంబంధిత, ఇతర వ్యాధులకి, మందులూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పారామెడికల్ సిబ్బంది, కందుల వీరభద్రమ్, విజయ్ కుమార్, ఆశా కార్యకర్త, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

అశ్వాపురం: మండల పరిధిలోని సీతరాంపురం గ్రామంలోని మానవీయ వృద్ధాశ్రమంలో అశ్వాపురం పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి రమేష్‌బాబు 51వ పెళ్లి రోజు సందర్భంగా సోమవారం వృద్ధులకు పాలు, పండ్లు, బ్రెడ్ పంచిపెట్టి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాశ్రమం ఉపాధ్యక్షుడు దైదా నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి కమటం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్ మేళా



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న తెల్లం వెంకట్రావ్

భద్రాచలంటౌన్: భద్రాచలం నియోజకవర్గంలో ఈ నెల 29న పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని స్థానిక నాయకుడు, పొంగులేటి అనుచరుడు డాక్టర్ తెల్లం వెంకట్రావ్ తెలిపారు. పట్టణంలోని పొంగులేటి, తెల్లం క్యాంపు కార్యాలయంలో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను వెంకట్రావ్ సోమవారం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఈ జాబ్ మేళాకు అనేక ఎమ్ఎన్‌సీ కంపెనీలు హాజరు కానున్నాయని, సుమారు పదివేల వరకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవాబ్, రజినీకాంత్, చుక్కా సుధాకర్, ఏసు రెడ్డి, గంగా భారతి, లక్ష్మీకాంతం, రసూల్, ఫాయజ్, విజయ్, వెంకట్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన



లిటిల్ ఫ్లవర్స్ విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే పొదెం వీరయ్య

భద్రాచలంటౌన్: ఇంటర్ ఫలితాల్లో సత్తచాటి జిల్లాలో మొదటి స్థానంలో నిలిచిన భద్రాచలం పట్టణంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యా సంస్థలకు చెందిన విద్యార్థులు లోహిత రెడ్డి, సుహానా ఆఫీస్, మహమ్మద్ సమరలను క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే పొదెం వీరయ్య సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏజెన్సీ కేంద్రమైన భద్రాచలంలోని లిటిల్ ఫ్లవర్స్ విద్యాసంస్థలు ఉత్తమమైన విద్యను అందించి రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తేవడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ మాగంటి ప్రసాద్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలా?

చర్ల: స్థానికంగా డిగ్రి విద్యార్థుల కోసం పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయకుండా వారి జీవితాలతో అధికారులు ఆడలాడుతున్నారని, ఇది ఎంతమాత్రం సరైంది కాదని పీడీఎస్‌యూ డివిజన్ కన్వీనర్ మునిగెల శివ అన్నారు. చర్లలో ఉన్న డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని రద్దు చేసి ఇక్కడి విద్యార్థులను భద్రాచలంలో పరీక్షలు రావాలని విద్యాశాఖాధికారులు సూచిస్తుండడాన్ని నిరశిస్తూ సోమవారం చర్లలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్ బి.భరణి బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ డివిజన్ కన్వీనర్ మునిగెల శివ మాట్లాడారు. గతంలో ఇక్కడ ఉన్న డిగ్రీ పరీక్షా కేంద్రాన్ని భద్రాచలంకు తరలించడంలో ఆతర్యమేమిటని ఆయన ప్రశ్నించారు. 53 కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలంకు వెళ్లి పరీక్షలు రాయడం ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. స్థానికంగా కేంద్రాన్ని ఏర్పాటు చేయకపోతే ఆందోళనలను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో విద్యార్థులు సాయితేజ, సందీప్, ఓంకార్, మహేష్, నందిని, అనూష, జితేంద్ర, హేమలత, మణిరత్నం, సుధారాణి, నిఖిత తదితరులు పాల్గొన్నారు.

సీఎంను ఫాం హౌస్‌కే పరిమితం చేయాలి



పినపాక: దీక్షా శిబిరంలో వీవోఏలకు సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్యే వీరయ్య

పినపాక: రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఓడించి, సీఎం కేసీఆర్‌ను శాశ్వతంగా ఫామ్ హౌస్‌కే పరిమితం చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే పోదెం వీరయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం మండలానికి వచ్చిన ఆయనకు మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయం ఎదుట గత 29 రోజులుగా దీక్ష చేస్తున్న ఐకేపీ వీవోఏల సమ్మెకు మద్దతు తెలిపారు. వారితోపాటు దీక్షపురంలో కూర్చొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వంలో తక్కువ వేతనంతో పనిచేస్తున్న వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే వీరయ్యకు వీవోఏలు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు తోటా దేవి, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ ఖాన్, పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్ ధర్మారావు, శ్రీవాణి, మండల అధ్యక్షుడు రామనాథం పాల్గొన్నారు.

ఐకేపీ కార్యాలయం ఎదుట ధర్నా

దుమ్ముగూడెం: ఐకేపీ వీఓఏల యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మె 29వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సోమవారం ఐకేపీ ఎంఎంఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిచారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల అధ్యక్షురాలు చిలకమ్మ మాట్లాడుతూ.. ఐకేపీ వీఓఏల సమస్యలు తీరెంత వరకు పోరాటం కొనసాగిస్తాం అని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఓఏల జిల్లా ఉపాధ్యక్షుడు గద్దల వెంకటేశ్వర్లు, మండల నాయకులు కుమారి, లక్ష్మి, పద్మ, వెంకటేశ్వర్లు, పద్మ, అరుణ, తిరపతమ్మ, శ్రీలత, రమాదేవి, వెంకటలక్ష్మి, కమల, మణి, నరేంద్ర, అరుణ, రాజేశ్వరి, కృష్ణవేణి, దుర్గారాణి, వెంకటనర్సమ్మ, భద్రమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

భద్రాచలంటౌన్: భద్రాచలం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ గతేడాది అనారోగ్యంతో మృతి చెందిన కె.నాగరాజు కుటుంబానికి డిపో కండక్టర్లు రూ.15 వేలను సమీకరించి సోమవారం డిపో మేనేజర్ రామారావు ద్వారా అందించారు. నరసింహారావు, గౌతమి, వీర వెంకన్న ఉద్యోగులు పాల్గొన్నారు.

కొరతను నివారించాలి

గుండాల: మండల కేంద్రంలో జీసీసీ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్ కొరతను నివారించాలని కోరుతూ మండలంలోని ప్రజాప్రతినిధులు సోమవారం ఐటీడీఏ పీవోకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. 20 రోజులుగా గుండాల మండలంలో జీసీసీ పెట్రోల్‌బంక్‌లో డీజిల్ కొరత తీవ్రంగా ఉందని, దీనివల్ల రైతులు ఇతర ప్రాంతాలకు వెళ్లి కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోయారు. ఎంపీపీ ముక్తి సత్యం, జెడ్పీటీసీ వాగబోయిన రామక్క, ఎంపీటీసీ కల్తి రాజేశ్వరి, పర్శిక పద్మ, సర్పంచ్ కోరం సీతారాములు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పరిపాలన అధికారి భీమ్

భద్రాచలంఅర్బన్: ఎండల సైతం లెక్క చేయకుండా సుదూర ప్రాంతాల నుంచి గిరిజన దర్బారులో అర్జీలు సమర్పించడానికి వచ్చే గిరిజనులందరి సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటీడీఏ పరిపాలన అధికారి భీమ్ అన్నారు. సోమవారం ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బారులో ఆయన గిరిజనుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. తన పరిధిలో ఉన్నవి వెంటనే పరిష్కరించి, మిగతా వాటిని సంబంధిత అధికారులకు చేరవేశారు. అర్జీలు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఎస్ ప్రభాకర్‌రావు, మేనేజర్ ఆదినారాయణ హెచ్ఐఓ దుర్గయ్య, ఇతర శాఖల సిబ్బంది నాగభూషణం, శ్రీనివాస్, సుగుణ, వెంకటేశ్వర్లు, బాలమల్లు, రాజాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి

అశ్వారావుపేటరూరల్: నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలను సమానంగా అభివృద్ధి చేస్తానని, ఈ విషయంలో వెనుకడుగు వేసేది లేదని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని ఊట్లపల్లి, రామన్నగూడెం పంచాయతీల్లో ఎన్నికల హామీలో భాగంగా నిర్మించిన సీసీ రహదారులను ఆయన సోమవారం ప్రారంభించగా.. ఆయా గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా ఊట్లపల్లి పంచాయతీ గంగారం గ్రామంలో రూ.6లక్షల 50వేలతో, రామన్నగూడెం పంచాయతీలో రూ.69లక్షల వ్యయంతో పంచాయతీ రాజ్ శాఖ ద్వారా నిర్మించిన సీసీ రోడ్లను ఆయన చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రామన్నగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ భవనానికి త్వరలోనే చుట్టూ ప్రహరీ గోడ, గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని అన్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా తనను గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ లూథరస్ విల్సన్, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈఈ శ్రీధర్, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ చిట్టూరి ఫణీంద్ర, జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, సర్పంచ్‌లు సాధు జోత్స్నబాయి, మడకం స్వరూప, ఎంపీటీసీ పద్దం కుమారి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నారం రాజశేఖర్, మాజీ జెడ్పీటీసీ సభ్యులు జేకేవీ రమణారావు, బీఆర్‌ఎస్ నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి, బిర్రం వెంకటేశ్వరరావు, కాసాని చంద్రమోహన్, జుజ్జూరి వెంకన్న, మోటూరి మోహన్ పాల్గొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు

అన్నపురెడ్డిపల్లి: మండల కేంద్రంలోని భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి వారి ఆలయంలో ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం ప్రత్యేక పూజలు జరిపించారు. ఉదయం స్వామి వారికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అభిషేకాలు, గోత్రనామార్చనలు, అన్నాభిషేకం, దూపదర్శనం తదితర పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఆలయ పునఃనిర్మాణకర్త మారగాని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వామి వారి పూజ కార్యక్రమాలలో ఎంపీపీ సున్నం లలిత, తహసీల్దార్ భద్రకాళి, ఉప సర్పంచ్ పర్సావెంకటేశ్వర్లు, బాలాజీ ఆలయ మాజీ చైర్మన్ వనమా గాంధీ, గోళ్లపుల్లారావు, దోసపాటి శంకర్ రావు, చల్లా రమేష్, ఇనపనూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎంకు వినతి

మణుగూరురూరల్: ఇల్లెందు ఏరియాలో జవహర్ ఖని ఓసీ గని రక్షణ అధికారి, ఇన్‌చార్జ్ మేనేజర్ శివ ప్రసాద్‌పై దాడి చేసిన బీఆర్‌ఎస్ నాయకుడు, సింగరేణి కార్మికుడు నాదెండ్ల శ్రీనివాస్‌రెడ్డిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ.. మణుగూరు ఏరియా సింగరేణి అధికారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు సంతకాల సేకరణతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు డి.లలిత్‌కుమార్ మాట్లాడుతూ..సింగరేణి సంస్థ పట్ల అంకితభావంతో పని చేస్తున్న అధికారిపై డ్యూటీలో తమ ఆటలు సాగడంలేదనే నెపంతో దుర్భాషలాడుతూ.. బెదిరింపులకు పాల్పడడమే కాకుండా దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీకేఓసీ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతిగౌడ్, అధికారులు జేవి రమణ, బి.శ్రీనివాసచారి, ఎం.నర్సిరెడ్డి, ఎస్.రమేష్, వెంగళరావు, అనురాధ, సంధ్యారాణి, డి.రాంబాబు, బి.వెంకటేశ్వర్లు, బి.రాజేశ్వరరావు, ఎం.లింగబాబు, నరసింహస్వామి, కె.సుదర్శన్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

భద్రాచలంఅర్బన్: భద్రాచలం శివారులోని అక్షయ ఫంక్షన్‌హాల్లో నేడు జరగనున్న సీపీఐ భద్రాచలం నియోజకవర్గం స్థాయి శాఖ కార్యదర్శి, మండలాల కార్యవర్గ సభ్యులు, ప్రజాసంఘాల బాధ్యత సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ఆకోజు సునీల్ కుమార్ కోరారు. సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రాంప్రసాద్, కల్లూరి వెంకటేశ్వరరావు తదితరులు హాజరు అవుతారని తెలిపారు. పార్టీ నిర్మాణం, ఎన్నికల వ్యూహం తదితర అంశాలపై చర్చిస్తారన్నారు.

‘సీఎం కప్’ పోటీలు ప్రారంభం

మండల స్థాయిలో ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీఎం కప్ క్రీడా పోటీలు సోమవారం పలు మండలాల్లో ప్రారంభమయ్యాయి. ఆయా ప్రాంతాల్లోని ప్రజాప్రతినిధులు పోటీలను ప్రారంభించి కాసేపు ఆటల్లో పాలుపొందారు. ఈ పోటీల్లో స్థానిక యువత పాల్గొని తమ ప్రతిభను కనబరుచుకోవాలని ఈ సందర్భంగా వారు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



సీఎం కప్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు



అన్నపురెడ్డిపల్లి: వాలీబాల్ సర్వీస్ చేస్తున్న ఎంపీపీ సున్నం లలిత



దుమ్ముగూడెం: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



అశ్వాపురం: గొందిగూడెంలో పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ సుజాత



బూర్గంపాడు: జెడ్పీటీసీ శ్రీలత ఆధ్వర్యంలో..



చంద్రుగొండ: అధికారులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న ఎంపీపీ పార్వతి